సాక్షి
అనంతపురం
శుక్రవారం । 28 । జూన్ । 2024



టన్ను చీనీ రూ.27 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.27 వేలు పలికాయి.



శ్రీదరి.. నాట్యమంజరి

అనంతపురం నగరానికి చెందిన శ్రీదరి శాస్త్రీయ నృత్యంలో రాణిస్తోంది. అందరినీ మంత్రముగ్ధులను చేస్తోంది.

8లో

గరిష్టం/కనిష్టం
36.1°/23.4°

జిల్లా అంతటా గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నాణ్యమైన ఎరువులు తయారు చేయాలి

శింగనమల: నాణ్యమైన ఎరువులను తయారు చేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి(డీఏఓ) ఉమామహేశ్వరమ్మ అన్నారు. గురువారం మండలంలోని సీ.బండమీదపల్లి వద్ద ఉన్న స్వర్ణ భూమి ఎరువుల తయారీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఎరువుల తయారీ కేంద్రంలో స్టాక్ వివరాలు, లైసెన్స్, రా మెటీరియల్, సేల్స్ రిజిస్టర్, ల్యాబ్, గోడౌన్‌లో ఉన్న స్టాక్‌ను పరిశీలించారు. ప్రతి నెలా స్టాక్ రిపోర్టును ఉన్నతాధికారులకు పంపించాలని ఏఓను ఆదేశించారు. ఆమె వెంట ఏఓ అన్వేష్‌కుమార్, టెక్నికల్ ఏఓ బాలాజి నాయక్, వీహెచ్‌ఏ అమరేష్ తదితరులు ఉన్నారు.

19 మంది సచివాలయ ఉద్యోగులకు మెమోలు

గుంతకల్లు రూరల్: గుంతకల్లు మండలంలోని నక్కనదొడ్డి, వైటీ చెరువు గ్రామాల్లోని 19 మంది సచివాలయ సిబ్బందికి గురువారం ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి మెమోలు జారీ చేశారు. విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో పాటు బయోమెట్రిక్ హాజరు వేయడం లేదని గుర్తించామన్నారు. దీంతో రెండు సచివాలయాలకు చెందిన 19 మందికి మెమోలను జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

బీటెక్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సత్యనారాయణ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో ఈ ఏడాది మేలో నిర్వహించిన బీటెక్ రెండో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–20), బీటెక్ మూడో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్–20) రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు గురువారం విడుదల చేశారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ చేతుల మీదుగా ఫలితాలు ప్రకటించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ. అరుణ కాంతి, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ డి. విష్ణువర్ధన్, డాక్టర్ డి. లలితకుమారి, పాలక మండలి సభ్యుడు డాక్టర్ రామశేఖర్ రెడ్డి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ మమత, సివిల్ విభాగాధిపతి అజిత తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ శిలాఫలకం ధ్వంసం



బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని గోవిందపల్లి సచివాలయ శిలాఫలకాన్ని దుండగులు ధ్వంసం చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇలా జరగడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ కార్యకర్తలే దుశ్చర్యకు దిగి ఉంటారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్ అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడం పిరికి పంద చర్యగా ఆయన అభివర్ణించారు.

బ్యాడిగి.. సాగు పెరిగి

- బ్యాడిగి మిర్చి సాగుపై అన్నదాతల ఆసక్తి
- విత్తన ధరలు ఆకాశాన్నంటినా సాగుకు సై అంటున్న వైనం
- ప్రస్తుతం 'సింజెంటా' కిలో రూ.1.35 లక్షల నుంచి రూ.1.50 లక్షలు
- 'డబ్బి' కిలో రూ.6 వేల నుంచి రూ.8 వేలు

మార్కెట్‌లో ధరలు బాగుండడం, కొంచెం కష్టపడితే మేలైన దిగుబడులు వస్తుండడం వెరసి.. జిల్లాలో బ్యాడిగి మిరప సాగు పెరుగుతోంది. విత్తన ధరలు పెరిగినా రైతులు ఎక్కడా వెనకడుగు వేయడం లేదు. సుదూర ప్రాంతాలకు వెళ్లి మరీ విత్తనాలు కొనుగోలు చేసి తీసుకువచ్చి సాగు చేస్తున్నారు.





నర్సరీలో పెరుగుతున్న మిరపనారు

రాయదుర్గం: ఎర్ర బంగారంగా పిలిచే (బ్యాడిగి) మిర్చి సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో ఏటేటా సాగు విస్తీర్ణం పెరుగుతోంది. పంట ఉత్పత్తుల్లో తెగుళ్లు కట్టడిచేస్తే ఆశించిన స్థాయిలో దిగుబడులు సాధ్యమవుతాయి. మార్కెట్లో గిట్టుబాటు ధరలు వస్తుండడంతో సాగుపై అన్నదాతలు మక్కువ పెంచుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అవసరమైన విత్తనాలను సమకూర్చుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పంట సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోనే అత్యధికంగా మిరప సాగుచేసే నియోజకవర్గాల్లో ఉరవకొండ మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత రాయదుర్గం, కళ్యాణదుర్గం ఉన్నాయి.

చుక్కలు చూపుతున్న విత్తన ధరలు

మిరపలో మొదటి రకం విత్తనాల ధరలు ఆకాశాన్నంటాయి. ఏమాత్రం దిగిరానంటున్నాయి. అయినా రైతు తగ్గేదే లే అంటున్నాడు. నచ్చిన విత్తనం కొనుగోలుకు ఎంత దూరమైనా సరే పయనమవుతున్నారు. ఎక్కువ మంది కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి, కర్నూలు జిల్లా ఆదోని ప్రాంతాల్లో సింజెంట రకం విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. డబ్బి రకం అయితే హుబ్లీ, ధార్వాడ, బళ్లారి ప్రాంతాల్లో కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం సింజెంటలో మొదటి రకం కిలో రూ.1.35 లక్షల నుంచి రూ.1.50 లక్షలు పలుకుతోంది. డబ్బి అయితే రూ.6 వేల నుంచి రూ.8 వేలకు పైగా ధర ఉంది. ఎకరా విస్తీర్ణంలో సింజెంట విత్తనం అయితే 100 నుంచి 120 గ్రాములు, డబ్బి అయితే కిలోకు పైగా నాటుకోవాల్సి వస్తోంది.

గత నష్టాలు పూడ్చుకునేలా..

ఎండు మిర్చి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గతేడాది మూడు నియోజకవర్గాల్లో సుమారు 40 వేల ఎకరాలకు పైగా మిర్చి పంట సాగులోకి వచ్చింది. ఈ ఏడాది మరో 10 వేల ఎకరాలకు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనాకు వచ్చారు. మార్కెట్లో నాణ్యమైన మిర్చి క్వింటా రూ.55 వేల నుంచి రూ.60 వేల వరకు పలుకుతోంది. గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా మిర్చి పంట తెగుళ్ల బారిన పడింది. దీంతో రైతన్నలు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. కొందరికైతే పెట్టుబడులు కూడా దక్కలేదు. ఆ లోటును ఈ సారి భర్తీ చేసుకునేలా రైతులు ముందస్తు ప్రణాళికలు వేసుకుంటున్నారు. ఎకరం సాగు చేసే రైతు రెండు ఎకరాలకు చేరడమే ఇందుకు నిదర్శనం.

ఆర్‌బీకేల్లో విత్తనాలందిస్తే మేలు

గతేడాది రైతుకు అవసరమయ్యే విత్తనాలను రైతు భరోసా కేంద్రాల్లోనే రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసింది. విత్తన కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకుని నాణ్యమైన విత్తనాలు అందించింది. కొత్త ప్రభుత్వం ఈ విషయంపై ఇప్పటివరకూ ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఈ క్రమంలో ఈ ఏడాది కూడా ఆర్‌బీకేల్లోనే విత్తనాలు రాయితీతో అందించాలని రైతులు కోరుతున్నారు.

పది ఎకరాలకు తగ్గేది లేదు



ఏటా మిర్చి పంట సాగు చేస్తా. గతేడాది కంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెంచుతున్నా. ప్రస్తుతం పది ఎకరాలకు తక్కువ కాకుండా మిరప నాటేలా పొలం సిద్ధం చేశా. కొంత నారు, కొన్ని విత్తనాలు సమకూర్చుకున్నా. తెగుళ్లే కాస్త కలవరపాటుకు గురిచేస్తాయి. ఈ సారి ముందస్తుగా మేల్కొని పంటను కాపాడుకుంటా. మిర్చికి మార్కెట్లో ఆశించిన ధరలు లభిస్తాయి.

– సుధాకర్‌రెడ్డి, రైతు, పూలకుంట

పరిశ్రమలతోనే ప్రగతి



పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్: పరిశ్రమల స్థాపనతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమవుతుందని పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజరావు అన్నారు. గురువారం స్థానిక పరిశ్రమల శాఖ కార్యాలయంలో పరిశ్రమల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన అనంతపురం జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెద్ద ఎత్తున పరిశ్రమలను ఏర్పాటు చేయడంతోనే ఉపాధి అవకాశాలు పెరిగి ప్రజల జీవన ప్రమాణాలు మరింతగా మెరుగుపడతాయన్నారు. పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వాలు సైతం వెన్నుదన్నుగా నిలుస్తున్నాయన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు జిల్లాలో పెద్ద ఎత్తున ఏర్పాటు కావడంతో స్థానికంగానే నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. యువ పారిశ్రామిక వేత్తల కోసం ఎంఎస్ఎంఈ పార్కులను ఏర్పాటు చేసి స్థలాలను కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సైతం విద్యుత్ రాయితీతోపాటు పెట్టుబడి రాయితీలను అందిస్తుందన్నారు. ఏపీఐఐసీ డిప్యూటీ జోనల్ మేనేజర్ నాగార్జున మాట్లాడుతూ పరిశ్రమల స్థాపన కోసం ఏపీఐఐసీలో దరఖాస్తు చేసుకున్న వెంటనే స్థల మార్కెట్ విలువపై రాయితీలు అందించడంతో పాటు మౌలిక వసతులను కల్పించి కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకొని పరిశ్రమల స్థాపన కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ మేనేజర్ ప్రకాష్, చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు శేషాంజనేయులు, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయాలు లీజు స్థలాల్లో లేవా?

- వైఎస్సార్ సీపీ కార్యాలయాలకు స్థలాలు కేటాయిస్తే తప్పా?
- టీడీపీ నాయకులు ద్వంద్వ వైఖరి వీడాలి
- పార్టీ కార్యాలయాలకు ప్రభుత్వ స్థలం లీజుకిచ్చే విధానం తెచ్చిందే టీడీపీ
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



మాట్లాడుతున్న పైలా నరసింహయ్య

అనంతపురం కార్పొరేషన్: 'గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఆ పార్టీ కార్యాలయాలకు లీజుకు స్థలాలు కేటాయించారు. అలాగే, గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీ కార్యాలయాలకు లీజుకు స్థలాలు కేటాయించారు. వాటిని తప్పు పట్టడం ఎంత వరకు సమంజసం' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ నాయకులు ద్వంద్వ వైఖరి వీడాలన్నారు. తమ పార్టీ భవనాలను లక్ష్యం చేసుకుని కూల్చుతామంటూ చౌకబారు రాజకీయాలు చేయడం సరికాదన్నారు. పార్టీ కార్యాలయాలకు ప్రభుత్వ స్థలాన్ని లీజుకిచ్చే విధానాన్ని తీసుకువచ్చింది తెలుగుదేశం పార్టీనేనన్నారు. అప్పట్లో హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్టు భవన్, గుంటూరు, కాకినాడ, విశాఖపట్నం, నెల్లూరు తదితర ప్రాంతాల్లో ఎకరాల మేర స్థలాలను టీడీపీ కార్యాలయ భవనాలకు లీజుకు కేటాయించారన్నారు. ఆ ప్రాంతాల్లో టీడీపీ కార్యాలయాల చిత్రాలను మీడియాకు చూపించారు. అనంతపురంలో హెచ్ఎల్‌సీ కాలనీలో ఏర్పాటు చేయనున్న వైఎస్సార్ సీపీ కార్యాలయానికి ప్రభుత్వం అనుమతిస్తూ ఇచ్చిన జీఓతో పాటు నగరపాలక సంస్థకు చెల్లించిన ఖాళీ జాగా పన్ను ప్రతిని చూపారు. ఇటీవల టీడీపీ అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఆయన అనుచర వర్గం నిర్మాణంలో ఉన్న భవనం వద్దకు వెళ్లి ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందనడం తగదన్నారు. ముందస్తుగా తమకు సమాచారం అందించి ఉంటే ఎమ్మెల్యే, ఇతర నాయకులకు టీ, కాఫీ, బిస్కెట్స్, స్నాక్స్ అందించి అనుమతులకు సంబంధించిన ప్రతులను చూపేవారమన్నారు. టీడీపీ కార్యాలయాలకు స్థలాలు కేటాయించినప్పుడు తమ పార్టీ ప్రశ్నించిన దాఖలాలు లేవన్నారు. ఇటీవల నగరపాలక సంస్థ, అహుడా అధికారులు తమకు నోటీసులందించారని, ఈ విషయంపై తమ పార్టీ అధిష్టానం హైకోర్టులో పిల్ దాఖలు చేసిందన్నారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు తాము నడుచుకుంటామన్నారు. పార్టీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ టీడీపీ నాయకులు మరోసారి వారి నిజస్వరూపాన్ని బయటపెడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నగరంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పితే, ఇప్పుడు టీడీపీ అధికారంలోకి రాగానే భవనాలు కూల్చేస్తాం, స్థలాలు లాక్కుంటాం అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా ఈ విష సంస్కృతిని వీడాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు చింతకుంట మధు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం చేయొద్దు

- కమిషనర్లకు కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో కమిషనర్ మేఘస్వరూప్,ఆర్‌డీఎంఏ మూర్తి

అనంతపురం అర్బన్: నగర, పురపాలక సంఘాల పరిధిలో అభివృద్ధి పనుల్లో జాప్యం చేయరాదని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత మునిసిపల్ కమిషనర్లను ఆదేశించారు. మొక్కల పెంపకం ఉద్యమంలా నిర్వహించాలని సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆర్‌డీఎంఏ, మునిసిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటి ముందు ఒక చెట్టు ఉండాలని చెప్పారు. అవసరమైన మొక్కలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. మొక్కలు నాటిన తరువాత దత్తత తీసుకున్న వారితో ప్రతిజ్ఞ చేయించాలని చెప్పారు. జిల్లాకు తొమ్మిది అన్నా క్యాంటీన్లు మంజూరు కాగా ఆరు నిర్మాణం పూర్తి చేసుకున్నాయన్నారు. మిగిలిన వాటిని పూర్తి చేయాలన్నారు. మునిసిపాలిటీల్లో ఉన్న క్యాంటీన్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు. అంతకు ముందు స్థానిక గుత్తిరోడ్డులోని అన్నాక్యాంటీన్ భవనాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. సమావేశంలో నగరపాలక కమిషనర్ మేఘస్వరూప్, ఆర్‌డీఎంఏ పీవీఎస్ఎన్ మూర్తి, కమిషనర్లు కిషోర్, శ్రీనివాసులు, వెంకటరమణయ్య, నరసారెడ్డి, రామ్మోహన్‌రావు, డీఈఈ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల భద్రత పటిష్టంగా ఉండాలి

ఈవీఎంల భద్రత పటిష్టంగా ఉండాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ పాత కార్యాలయం ఆవరణలోని గోడౌన్‌ను కలెక్టర్ గురువారం సందర్శించి వాటిలో భద్రపరిచిన ఈవీఎంలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంల భద్రత విషయంలో రాజీపడకూడదని ఆదేశించారు. గోడౌన్ వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఉండాలన్నారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేస్తూ ఉండాలన్నారు. కార్యక్రమంలో నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీకి చర్యలు

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్ల పంపిణీకి చర్యలు చేపట్టామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌కు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. సీఎస్ గురువారం వెలగపూడి నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య పాల్గొన్నారు. జూలై 1న పింఛన్ల పంపిణీ కోసం బ్యాంకుల ద్వారా నిధులను శనివారమే విత్‌డ్రా చేసుకునేలా చర్యలు చేపట్టామన్నారు. వెల్ఫేర్ అసిస్టెంట్ల ద్వారా హౌస్ హోల్డ్ మ్యాపింగ్ పూర్తి చేస్తామన్నారు. పింఛను పంపిణీ తరువాత లబ్ధిదారుల నుంచి అక్నాలెడ్జ్‌మెంట్ తీసుకుంటామన్నారు. అనంతరం పింఛన్ల పంపిణీపై డీఆర్‌డీఏ పీడీకి సూచనలిచ్చారు. పంపిణీకి అవసరమైన అదనపు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. పింఛన్ల పంపిణీకి మండలస్థాయిలో అధికారులందరూ అందుబాటులో ఉండాలని సూచించారు. వీసీలో డీఆర్‌డీఏ అడ్మిన్ అసిస్టెంట్ అజంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



సిబ్బందితో కలిసి భోజనం స్వీకరిస్తున్న డీఐజీ షిమోషి, ఎస్పీ గౌతమి శాలి



మాట్లాడుతున్న ఎస్పీ గౌతమి శాలి

- ఎస్పీ గౌతమి శాలి


అనంతపురం: శాంతిభద్రతల పరిరక్షణ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతగా పరిగణించాలని ఎస్పీ గౌతమి శాలి అన్నారు. జిల్లా పోలీసు కాన్ఫరెన్స్ హాలులో గురువారం పోలీసు అధికారులు, సెబ్ విభాగం అధికారులతో నెలవారీ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో నమోదైన మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కేసులు, పోక్సో, హత్య కేసులు, ఎస్సీ, ఎస్టీ మహిళలపై జరిగిన నేరాలు, నమోదైన కేసులపై సబ్ డివిజన్ల వారీగా ఎస్పీ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రౌడీ షీటర్లు, కిరాయి హంతకుల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. ప్రస్తుత వారి ప్రవర్తన తీరుపై ఆరా తీయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదంలో ఒకరు చనిపోయినా మొత్తం ఆ కుటుంబ జీవనం ఛిద్రమవుతుందని గుర్తించాలన్నారు. ప్రతి ఒక్కరూ గట్టి సంకల్పం, కార్యాచరణతో రోడ్డు ప్రమాదాలను కట్టడి చేయాలన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, వీవీపీల భద్రత, సంచలనాత్మక నేరాల దర్యాప్తు తదితర సమయాల్లో ఎలా వ్యవహరించాలో ఎస్పీ దిశానిర్దేశం చేశారు. మట్కా, పేకాట, మత్తు పదార్థాలు, నాటు సారా విక్రయాలు ఎక్కడా జరగరాదన్నారు. అసాంఘిక శక్తులను ప్రోత్సహించినా, సంబంధాలు కొనసాగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.రాత్రి వేళ మరింత అప్రమత్తంగా పనిచేయాలని, బీట్లు, పెట్రోలింగ్ పెంచాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర్ రెడ్డి, జి. రామకృష్ణ, డీఎస్పీలు ఎం. ఆంథోనప్ప, టీవీవీ ప్రతాప్, జి. శ్రీనివాసులు, శివభాస్కర్ రెడ్డి, జనార్ధన నాయుడు, మునిరాజ (ఏ.ఆర్) తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో పోలీసుల సేవలు అద్భుతం

ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో పోలీసుల సేవలు అద్భుతమని అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషి కొనియాడారు. స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో గురువారం సిబ్బందికి ప్రశంసా పత్రాలు, రివార్డులు అందజేశారు. ఇదే స్ఫూర్తితో విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. జిల్లాను ప్రశాంతంగా ఉంచాలని సూచించారు. అనంతరం పోలీస్ కన్వెన్షన్ హాలులో సిబ్బంది, అధికారులతో కలిసి డీఐజీ, ఎస్పీ గౌతమి శాలి భోజనం చేశారు.

ఉరవకొండలో టీడీపీ దౌర్జన్య కాండ

- వైఎస్సార్ సీపీ కార్యకర్తపై కట్టెలతో దాడి



అనంతపురం: ఉరవకొండలో టీడీపీ నేతల ఆగడాలు కొనసాగుతున్నాయి. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెచ్చిపోతున్న ఆ పార్టీ నాయకులు గురువారం ఓ వైఎస్సార్ సీపీ కార్యకర్తపై కట్టెలతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఉరవకొండ కవితా హోటల్ సర్కిల్ వద్ద గురువారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి వెళుతున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త గంధోడి మారేష్‌ను ఒక్కసారిగా పదుల సంఖ్యలో టీడీపీ నాయకులు చుట్టుముట్టి కట్టెలతో దాడికి దిగారు. అడ్డుకోవడానికి ప్రయత్నించిన కుటుంబ సభ్యులనూ కొట్టి పక్కకు నెట్టేశారు. నడిరోడ్డుపైనే జరిగిన ఈ దారుణాన్ని చూసి స్థానికులు భయకంపితులయ్యారు. తలకు బలమైన రక్తగాయాలైన మారేష్‌ను కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే పోలీసులు రంగ ప్రవేశం చేసి కవితా హోటల్ సర్కిల్ వద్ద బందోబస్తు నిర్వహించారు.

కఠిన చర్యలు తీసుకోండి: ఎస్పీకి మాజీ ఎమ్మెల్యే ఫిర్యాదు

వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కోరారు. మారేష్‌పై దాడికి పాల్పడిన టీడీపీ నాయకులపై కేసు నమోదు చేయాలని కోరుతూ ఎస్పీ గౌతమి శాలికి ఫిర్యాదు చేశారు. దాడులు ఇలాగే కొనసాగితే తమ పార్టీ కార్యకర్తలూ తీవ్ర స్థాయిలో ప్రతిఘటించాల్సి వస్తుందన్నారు. కఠిన చర్యలు తీసుకుని టీడీపీ ఆగడాలను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఆదాయ వనరులపై దృష్టి సారించండి

అనంతపురం సిటీ: ఆదాయ వనరులపై దృష్టి సారించాలని జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి అన్నారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో గల డీపీఆర్‌సీ భవన్‌లో గురువారం ఎంపీడీఓలు, ఈఓపీఆర్‌డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపిక చేసిన సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ వ్యవస్థలోనైనా ఆర్థిక వనరులే కీలకమన్నారు. ఆదాయ వనరులను పెంపొందించుకున్నప్పుడే ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడి ఆర్థికంగా బలోపేతం కాగలమన్నారు. రాష్ట్ర ఐదో ఆర్థిక కమిషన్ సెక్రటరీ కేవీ రమణారెడ్డి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులు సమీక్షించి, జవాబుదారీతనం పెంపొందించడమే ధ్యేయంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూలధన వ్యయం, స్థానిక సంస్థల అవసరాలు అంచనా వేయడానికి శిక్షణ తరగతులు దోహదపడతాయని పేర్కొన్నారు. మండల, జిల్లా పరిషత్ పరిధిలో పన్నుల వర్తింపు, ఖర్చులు, ఇతర ప్రాథమిక అవసరాలు తీర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంపై చర్చించారు. కార్యక్రమంలో ఆర్థిక కమిషన్ సభ్యులు ప్రసాదరావు, పద్మారావు, కృపారావు, డీపీఓ ప్రభాకర్‌రావు, డిప్యూటీ సీఈఓ లలితబాయి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సాగు సాయం తక్షణమే అందించాలి

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున



వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

అనంతపురం రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు సాగు సాయం మొత్తాన్ని ఈ ఖరీఫ్ సీజన్‌లోనే అందించాలని ప్రభుత్వాన్ని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. రైతు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయన్నారు. పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకోవడంలో ఉదాసీనత వీడాలన్నారు. గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే సాగుకు సాయం కింద రూ. 20 వేలు ఇస్తామని చంద్రబాబు హామీనిచ్చారని, ఆ మొత్తాన్ని తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి రూ.3లక్షల వరకు వడ్డీలేని పంట రుణాలు ఇవ్వాలన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు రమేష్, చలపతి, నగేష్, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీదరి.. నాట్య మంజరి



- కూచిపూడిలో రాణిస్తున్న విద్యార్థి
- గిన్నీసును తాకిన 'అనంత' కళాకెరటం

అనంతపురం కల్చరల్ : అనంత కళావేదికపై ఓ సారి నృత్యపోటీలు జరుగుతున్నాయి. శాస్త్రీయ నృత్యం కావడంతో పెద్ద సంఖ్యలో కళాభిమానులు హాజరయ్యారు. ఒకరిని మించి మరొకరు పోటీ పడుతూ అభినయిస్తున్నారు. అయితే అందరిలోనూ చిన్నారి శ్రీదరి నాట్యం అందరినీ మంత్ర ముగ్ధులను చేసింది. అప్పటికి ఆ చిన్నారికి పదేళ్లయినా లేవు. గిర్రున తిరుగుతున్న కాలచక్రంతో పోటీపడుతున్నట్లు మరో ఎనిమిదేళ్లలో దాదాపు వందకు పైగా ప్రదర్శనలు, దేశవిదేశాలలో లెక్కలేనన్ని అభినందనలు, సన్మానాలు అందుకుంది. కూచిపూడిలోని ప్రతి అంశాన్ని ఆకళింపు చేసుకున్న శ్రీదరి..... అనంత నృత్య కళానిలయం తీర్చిదిద్దిన అపురూప రత్నంగా అనతికాలంలోనే ఖ్యాతిగాంచింది.

బాల్యంలోనే మువ్వల సవ్వడి

అనంతపురం నగరానికి చెందిన టీకే ఆనంద్, గాయత్రి దంపతుల కుమార్తె శ్రీదరి తన ఐదేళ్ల వయసులోనే మువ్వల సవ్వడికి ఆకర్షితురాలైంది. ఆ చిన్నారి ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు సైతం ఆమెను శాస్త్రీయ నృత్యం వైపు ప్రోత్సహించారు. ప్రముఖ నృత్య దర్శకులు సంధ్యామూర్తి వద్ద శిక్షణ మొదలు పెట్టిన అనతికాలంలోనే వందలాది ప్రదర్శనలతో మైమరిపించింది. ప్రధాన పాత్రలలో అద్భుత అభినయాన్ని ప్రదర్శించి అందరి మన్ననలను పొందింది. భరతనాట్యం, కూచిపూడి, జానపదం... నృత్యరీతి ఏదైనా శ్రీదరిది అగ్రతాంబూలమే. ఇప్పటికే జాతీయస్థాయిలో వివిధ ప్రాంతాల్లోనే కాకుండా జర్మనీలో సైతం అనంత తరపున కళా ప్రదర్శనలిచ్చి మెప్పించింది.

అందుకున్న అవార్డులు ఇవే..

- 2014లో నాట్య ప్రస్థానం ప్రారంభించిన మూడేళ్లకే 2017లో చెన్నైలో జరిగిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్, ఏసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తన పేరు నమోదు చేసుకుంది.
- 2018లో నాట్యకళా నీరాజనం పేరు సాగిన భారత్ వరల్డ్ రికార్డ్స్‌లో పాల్గొని ఉత్తమ ప్రదర్శనకు గాను ప్రశంసాపత్రాన్ని అందుకుంది.
- 2019లో ప్రదర్శించిన సారంగలాసితలోనూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది.
- 2019లో డెహరాడూన్‌లో జరిగిన రంగ్ మహోత్సవ్‌లో పాల్గొని జానపద నృత్య విభాగం, కూచిపూడి రెండింటిలోనూ ప్రథమ స్థానంలో నిలిచింది.
- 2019లో తమిళనాడులోని తిరువరూరులో జరిగిన నృత్య ప్రదర్శనల్లో రాణించి ట్రెడిషనల్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకుంది.
- 2023లో ఇండో జర్మన్ అసిసోసియేషన్ ఆధ్వర్యంలో జర్మనీలో నిర్వహించిన అంతర్జాతీయ కళా ప్రదర్శనల్లోనూ పాల్గొని అక్కడి వారితో ప్రశంసలందుకుంది.
- కూచిపూడి, భరతనాట్యంలో ప్రత్యేక కోర్సులు చేస్తూనే వివిధ వేదికలపై నృత్యభారతి, నాట్య మంజరి, కళా సౌరభ వంటి బిరుదులందుకుని స్ఫూర్తిదాయకంగా నిలిచింది.



సాధించిన అవార్డులు చూపుతున్న శ్రీదరి



వరల్డ్ రికార్డులతో...

అనంత ఐకాన్‌గా మారుతా...

చిన్నప్పటి నుంచి అమ్మ, నాన్న ప్రోత్సాహిస్తూ వచ్చారు. అమ్మ గాయత్రికి శాస్త్రీయ నృత్యంలో ప్రవేశముంది. నటరాజ రామకృష్ణ వద్ద కొన్నేళ్లు నాట్యం నేర్చుకుని ఆపేసింది. తన ఆశయాన్ని నా ద్వారా ఆమె సఫలీకృతం చేసుకోవడం నాకెంతో ఆనందాన్నిస్తోంది. ఎప్పటికైనా శాస్త్రీయ నాట్యానికి అనంత ఐకాన్‌గా నిలవాలని ఉంది. భారతదేశం గర్వించ దగ్గ నృత్యాలను మరిన్ని విదేశాలలో ప్రదర్శించాలన్నదే నా లక్ష్యం. – శ్రీదరి, అనంతపురం

అక్రమ మైనింగ్‌తో దోపిడీ

- వైఎస్సార్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ

అనంతపురం ఎడ్యుకేషన్: అధికార పార్టీ నేతలు, మైనింగ్ అధికారులు కుమ్మక్కై అక్రమంగా మైనింగ్‌కు తెరలేపారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రమణ ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న క్వారీల్లో అవకతవకలు జరిగాయనే పేరుతో టీడీపీ ప్రభుత్వం 14 రోజులుగా రాష్ట్రంలో మైనింగ్ కార్యకలాపాలని పర్యవేక్షించే డైరెక్టరేట్‌కు తాళం వేసిందని గుర్తు చేశారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మైనింగ్ ఆఫీసులన్నీ మూతపడ్డాయన్నారు. ఇదే అదనుగా భావించిన టీడీపీ నేతలు, సంబంధిత అధికారులు అక్రమంగా మైనింగ్‌కు తెరలేపి అడ్డగోలుగా దోపిడీ సాగిస్తున్నారన్నారు. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి పడుతోందన్నారు. మైనింగ్ కార్యాలయాలకు మూత వేయడంతో పాలిషింగ్ యూనిట్లు, క్వారీలకు అనుబంధంగా పనిచేసే ట్రక్కులు, లారీలు, లాజిస్టిక్ వ్యాపారాలన్నీ ఇబ్బందుల్లో పడ్డాయన్నారు. గతంలో రాయల్టీలు చెల్లించి, అనుమతి పొందిన యజమానులను, సంబంధిత అధికారులను బెదిరించి క్వారీలను ఎక్కడికక్కడ కొల్లగొట్టడానికి ఇదే అవకాశంగా మార్చుకున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే దృష్టిపెట్టి గతంలో తీసుకున్న లీజులు అయిపోయి ఉంటే వాటి స్థానంలో కొత్తగా టెండర్లు పిలవాలన్నారు.

మూడో అంతస్తు పైనుంచి కిందపడి వివాహిత మృతి



సుమలత (ఫైల్)

రాప్తాడు రూరల్: ప్రమాదవశాత్తు మూడో అంతస్తు పైనుంచి కింద పడి ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.... అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి పంచాయతీ బీఎస్‌ఆర్ కాలనీకి చెందిన ఆనంద్‌కుమార్, సుమలత (37) దంపతులు. ఆనంద్‌కుమార్ బిల్డింగ్ కాంట్రాక్టర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఇళ్లంతా శుభ్రం చేసిన సుమలత... దుస్తులు ఉతికి అనంతరం మూడో అంతస్తుపై ఉన్న సింటెక్ ట్యాంకు శుభ్రం చేసేందుకని తన మరిది కుమార్తెను వెంట పెట్టుకుని వెళ్లింది. కట్టికు బట్ట కట్టి మొరుము (నాలుగు ఇంచుల గోడ) మీద నిలబడి ట్యాంకు లోపల శుభ్రం చేస్తుండగా అదుపు తప్పి ఒక్కసారిగా కింద ఉన్న ప్రహరీ మీదుగా నేలపై పడింది. ఆ సమయంలో పెద్దగా శబ్దం రావడంతో బంధువులు, చుట్టుపక్కల నివాసాల వారు అక్కడకు చేరుకున్నారు. బలమైన గాయాలైన సుమలతను వెంటనే సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక అదే రోజు రాత్రి ఆమె మృతి చెందింది. ఘటనపై అనంతపురం రూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా రాణించాలి

- ప్రారంభమైన 14వ అంతర జిల్లా బాలుర హాకీ టోర్నీ



హాకీలో తలపడుతున్న క్రీడాకారులు

ధర్మవరం అర్బన్: అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా రాణించాలని హాకీ క్రీడాకారులకు ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన ఇన్‌చార్జ్ చిలకం మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో గురువారం 14వ అంతరజిల్లా బాలుర హాకీ టోర్నీని వారు ప్రారంభించి, మాట్లాడారు. మంత్రి సత్యకుమార్‌తో మాట్లాడి వచ్చే ఏడాది నిర్వహించే టోర్నీకి టర్ఫ్‌కోర్టు ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. జిల్లా హాకీ జనరల్ సెక్రటరీ బంధనాథం సూర్యప్రకాష్ మాట్లాడుతూ... టోర్నీలో 17 జిల్లాల జట్లు పాల్గొన్నట్లు తెలిపారు. కాగా, గురువారం ఉదయం ఎన్టీఆర్, ఏలూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 18–0 గోల్స్ తేడాతో ఎన్టీఆర్ జిల్లా జట్టు విజయం సాధించింది. అలాగే శ్రీకాకుళం, తిరుపతి జిల్లా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 1-4 గోల్స్ తేడాతో తిరుపతి జట్టు గెలుపొందింది. ప్రకాశం, వైఎస్సార్ జట్ల మధ్య మ్యాచ్‌లో 8–0 గోల్స్ తేడాతో ప్రకాశం జట్టు విజయం సాధించింది. కృష్ణ జట్టుపై 12–0 గోల్స్ తేడాతో కాకినాడ జట్టు విజయం సాధించింది. 1-2 గోల్స్ తేడాతో అన్నమయ్య జట్టుపై విశాఖపట్నం జట్టు గెలుపొందింది. అనకాపల్లి, అనంతపురం జట్ల మధ్య మ్యాచ్, నెల్లూరు, గుంటూరు జట్ల మధ్య మ్యాచ్ 3-3 పాయింట్లతో డ్రా గా ముగిశాయి. కార్యక్రమంలో ఏపీ హాకీ సీఈఓ నిరంజన్‌రెడ్డి, హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు చాణుక్యరాజు, జనరల్ సెక్రటరీ హర్షవర్ధన్, కోశాధికారి థామస్ పీటర్, జిల్లా హాకీ అసోసియేషన్ ప్రతినిధులు రామచంద్ర, అంజన్న పాల్గొన్నారు.

చిరుత దాడిలో దూడ మృతి

కళ్యాణదుర్గం రూరల్: చిరుత దాడిలో ఓ ఆవు దూడ మృతి చెందింది. వివరాలు... కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామానికి చెందిన జిన్నా రాజులు... గ్రామ సమీపంలోని తన వ్యవసాయ క్షేత్రంలో పాడి పోషణ కూడా చేపట్టారు. ఈ క్రమంలో బుధవారం ఆవులను కట్టేసి ఇంటికి చేరుకున్నాడు. గురువారం ఉదయం తోట వద్దకెళ్లిన రాజులు... అక్కడ పడి ఉన్న ఆవు దూడ కళేబరాన్ని చూసి వెంటనే అప్రమత్తమయ్యాడు. దూడ ఉదర భాగాన్ని అడవి జంతువు పూర్తిగా చీల్చి తిన్నట్లుగా ఉంది. అక్కడున్న జంతువు పాదాల గుర్తులను బట్టి చిరుత దాడి చేసినట్లుగా నిర్ధారించుకున్నాడు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. చిరుత దాడిలోనే దూడ మృతి చెందినట్లు నిర్ధారించారు.

కోలుకుంటున్న విద్యార్థినులు



విద్యార్థిని పవిత్రకు చికిత్సలు అందిస్తున్న వైద్యులు



అస్వస్థతకు గురై కోలుకున్న విద్యార్థినులు

గుత్తి రూరల్: మండలంలోని రజాపురం గ్రామంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలోని విద్యార్థినులు కోలుకుంటున్నారు. కలుషిత నీటిని తాగిన పాఠశాలలోని దాదాపు 25 మంది విద్యార్థునులు వాంతులు, విరేచనాలతో బాధపడిన విషయం తెలిసిందే. గురువారం ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థిని పవిత్ర మాత్రమే అస్వస్థతకు గురైంది. వైద్యులు ప్రవీణ్‌కుమార్, దేవేంద్రనాయక్, హెల్త్ సూపర్‌వైజర్లు లాజరస్, ఆంజనేయులు చికిత్స అందించడంతో ఆమె పరిస్థితి క్రమంగా కుదుటపడుతోంది. ఆహారం, తాగునీటిని పరీక్షల నిమిత్తం కర్నూలుకు పంపినట్లు వైద్యుడు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కాగా, ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి, తహసీల్దార్ భారతి గురువారం గురుకుల పాఠశాలను సందర్శించారు. టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణ సైతం పాఠశాలను సందర్శించి విద్యార్థునులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు. గురుకులంలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామన్నారు. సీపీఎం, ఎస్ఎఫ్ఐ, ఎంఆర్‌పీఎస్ నాయకులు సందర్శించి, విద్యార్థినులను పరామర్శించారు. గురుకుల పాఠశాలను పరిశీలించేందుకు అమరావతి నుంచి వచ్చిన సాంఘిక సంక్షేమ శాఖ సంయుక్త కార్యదర్శి శివరావు, డీసీఓ మురళీకృష్ణ, ప్రిన్స్‌పాల్ ఉషారాణిని కలసి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బి.శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కసాపురం రమేష్, ఎంఆర్‌పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు సునీత, సీనియర్ నాయకుడు నరసింహులు మాట్లాడుతూ... 620 మంది విద్యార్థినులు ఉండగా ఇద్దరే పారిశుద్ధ్య కార్మికులు ఎంత వరకూ పరిసరాలు, డ్రైనేజీ కాలువలు శుభ్రం చేయగలరన్నారు. ఈ నెల 23న ఉడకని పచ్చి చికెన్ విద్యార్థినులకు వడ్డించడంతోనే వారు వాంతులు, విరేచనాలు చేసుకున్నారని వారు విమర్శించారు. స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులో ఉంచాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మగువలు మెచ్చిన 'వన్ గ్రామ్'



అచ్చం మేలిమి బంగారంలా మెరిసిపోతున్న వన్ గ్రామ్ గోల్డ్ నెక్లెస్ సెట్, వన్ గ్రామ్ గోల్డ్ గాజులు

- సామాన్య, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో లేని బంగారం ధర
- బంగారు తాపడం నగలపై నానాటికీ పెరుగుతున్న ఆసక్తి
- రోల్డ్‌గోల్డ్ స్థానంలో వన్‌గ్రామ్ గోల్డ్

ధర్మవరం అర్బన్: కొన్నేళ్లుగా బంగారం ధర రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో ఆభరణాల కొనుగోలు సామాన్య, మధ్య తరగతి ప్రజలకు తలకు మించిన భారంగా మారింది. ఈ నేపథ్యంలోనే చూసేందుకు మేలిమి బంగారం కంటే మిన్నగా కనిపించే వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలపై అందరూ ఆసక్తి చూపుతున్నారు. పండుగలు, శుభకార్యాలకు వీటిని ధరిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లోనూ వన్‌గ్రామ్ గోల్డ్ దుకాణాలు ఇబ్బడి ముబ్బడిగా వెలిసి వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి.

తేడా గుర్తించడం కష్టమే

మార్కెట్లోకి వన్‌గ్రామ్ గోల్డ్ నగలు రాకముందు గిల్టు నగలకి, బంగారు నగలకీ చూసేందుకు చాలా తేడా ఉండేది. ఫ్యాషన్‌గా పెట్టుకోవడానికే తప్ప గిల్టు నగలు పెళ్లిళ్లు లాంటి పెద్ద వేడుకలప్పుడు ధరించడానికి అంతగా ఇష్టపడేవారు కాదు. కానీ, ఇప్పుడు ఇత్తడేదో పుత్తడేదో తెలియనంతగా అందమైన రాళ్ల నగిషీలతో మెరిసిపోతూ వన్‌గ్రామ్ గోల్డ్ నగలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో వయసు భేదం లేకుండా చిన్నాపెద్దా అందరూ వీటిని ఇష్టంగా ధరిస్తున్నారు. చెవిపోగుల నుంచి కాలిపట్టీల వరకూ... హారాల నుంచీ వడ్డాణాల దాకా అచ్చం బంగారమేమో అనిపించేలా ఆకట్టుకుంటున్నాయి.

రోల్డ్‌గోల్డ్‌కు, వన్‌గ్రామ్‌కు తేడా ఇదే

రోల్డ్‌గోల్డ్‌కు, వన్‌గ్రామ్ బంగారు ఆభరణాలకు పెద్దగా తేడా ఉండదు. రోల్డ్‌గోల్డ్ నగలను రాగి, ఇనుము, అల్యూమినియం తదితర వాటితో తయారు చేస్తారు. వీటికి 8 లేక 10 క్యారెట్ల బంగారం పూత వేస్తారు. 10 క్యారెట్ల బంగారంలో 41.7 శాతం మాత్రమే బంగారం ఉంటుంది. నీళ్లలో వాడితే ఇవి త్వరగా నల్లబడిపోతాయి. ఇక వన్‌గ్రామ్ గోల్డ్ నగలను కేవలం రాగి లేదా వెండితో మాత్రమే తయారు చేస్తారు. వీటిని 22 లేదా 24 క్యారెట్ల బంగారంతో తాపడం చేయడం ద్వారా బంగారు ఆభరణాలకంటే ఎక్కువ ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఎక్కువ కాలం రంగు పోకుండా ఉంటాయి.

తయారీ ఎక్కడంటే...

వన్‌గ్రామ్ గోల్డ్ ఎక్కువగా ముంబయి, బెంగళూరు, మహారాష్ట్ర, గుజరాత్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా మచిలీపట్నం తదితర ప్రాంతాల్లో ఎక్కువగా చేస్తున్నారు. గాజులు, నెక్లెస్‌లు, వడ్డాణాలు, గొలుసులు, ఉంగరాలు, లాకెట్లు, వంకీలు, కాళ్ల పట్టీలు, చెవి రింగులు వంటి పలు రకాల నగలతో పాటు ఆర్డర్లపై ప్రత్యేకంగా కోరిన మోడల్‌నూ తయారు చేసి ఇస్తున్నారు.

ఉపాధి కల్పిస్తోన్న వ్యాపారం

బంగారం తర్వాత బంగారం అంతటి పేరున్న వన్‌గ్రామ్ గోల్డ్ వ్యాపారులకు ఉపాధి మార్గాలను చూపుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రతి పట్టణం, మండల కేంద్రాల్లో ప్రత్యేక షాపులు ఏర్పాటు చేసి వీటి అమ్మకాలు సాగిస్తున్నారు. ఒక్క అనంతపురం నగరంలోనే వందకుపైగా వన్‌గ్రామ్ గోల్డ్ అమ్మకాలు జరిపే దుకాణాలున్నాయంటే వీటిపై ఉన్న క్రేజ్ ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఈ ఆభరణాలు వివిధ ఆకారాల్లో రూ.100 నుంచి రూ.6వేల వరకు అందుబాటులో ఉంటున్నాయి.

చోరీ జరిగినా.. నష్టం లేదన్న ధీమా

ఇటీవల చైన్ స్నాచింగ్‌లు, ఇంటికి తాళం వేస్తే దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇలాంటిఘటనలు జరిగినా ఆర్థికంగా నష్టం ఉండదనే ఉద్దేశంతో చాలా మంది ధనిక వర్గాల మహిళలు సైతం మేలిమి బంగారు నగలను బ్యాంక్ లాకర్లలో భద్రపరిచి, వన్‌గ్రామ్ గోల్డ్ ఆభరణాలను ఇంట్లో తెచ్చి పెట్టుకుంటున్నారు. ప్రత్యేకమైన సందర్భాల్లో తప్ప మరెన్నడూ బంగారు ఆభరణాల జోలికి వెళ్లడం లేదు. మిగిలిన సమయాల్లో వన్‌గ్రామ్ గోల్డ్‌తోనే కాలం నెట్టుకొస్తున్నారు. వీటికి గ్యారంటీ కూడా లభిస్తుండడంతో వినియోగదారుల సంఖ్య నానాటికీ పెరిగిపోతోంది.

బాలల సంరక్షణ కేంద్రానికి చిన్నారులు

- ఏడాది లోపు తల్లిదండ్రులు.. రెండు రోజుల క్రితం నాయనమ్మ మృతి



అనాథలుగా మారిన పిల్లలతో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, తదితరులు

ఉరవకొండ: ఏడాదిలోపే ఆ చిన్నారుల తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందారు... అప్పటి నుంచి వారి పోషణ చూసుకుంటున్న నాయనమ్మ కూడా నాలుగు రోజుల క్రితం మృతి చెందింది. దీంతో అనాథలుగా మారిన చిన్నారులను ఐసీడీఎస్ అధికారులు బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. వివరాలు.. ఉరవకొండ మండలం పెద్దకొకుంట్ల గ్రామానికి చెందిన ఆంజనేయులు, సులోచన దంపతులకు 14 ఏళ్ల వయసున్న వైష్ణవి, తొమ్మిదేళ్ల వయసున్న సుజన, నాలుగేళ్ల వయసున్న రామ్‌చరణ్ సంతానమున్నారు. కూలి పనులతో జీవనం సాగిస్తూ వైష్ణవిని పదో తరగతి, సుజనను ఏడో తరగతి చదివించుకుంటున్నారు. 2023, జూన్ 6న అనారోగ్యంతో తల్లి సులోచన మృతి చెందింది. అదే ఏడాది డిసెంబర్ 10న తండ్రి కూడా అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి పిల్లల బాగోగులను నాయనమ్మ రామాంజినమ్మ, తాతయ్య సుంకన్న చూసుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 23న నాయనమ్మ కూడా మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి వెంటనే స్పందించారు. జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, సూపర్‌వైజర్ రబియా, మంజునాథ్ తదితరులతో కలసి గురువారం పెద్దకొకుంట్లకు చేరుకుని చిన్నారులతో మాట్లాడి బాలల సంరక్షణ కేంద్రానికి తరలించారు. చిన్నారుల ఆలనాపాలనతో పాటు వారికి విద్యాబుద్ధులు చెప్పిస్తామని ఈ సందర్భంగా గ్రామస్తులకు ఐసీడీఎస్ పీడీ భరోసానిచ్చారు.

క్లుప్తంగా

ప్రతి పాఠశాల ఆదర్శంగా నిలవాలి



మాట్లాడుతున్న ఎంఈఓలు

ఆత్మకూరు: మండలంలో ఉన్న ప్రతి ప్రభుత్వ పాఠశాల ఆదర్శంగా నిలవాలని ఎంఈఓలు నరసింహా రెడ్డి, రామాంజనేయులు తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో డయేరియా వ్యాధి వ్యాపిస్తుందన్నారు. డయేరియా నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా పాఠశాలలో అమలవుతున్న నేను బడికి పోతా, విద్యా ప్రవేశ్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. విద్యా కానుక కిట్లను విద్యార్థులందరికీ అందజేయాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు



మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం రూరల్: వేరుశనగ పంట సాగులో సరైన మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని రైతులకు జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ సూచించారు. ఎ.నారాయణపురం రైతు భరోసా కేంద్రంలో గురువారం నిర్వహించిన సాగుకు సమాయత్తం కార్యక్రమాన్ని రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయశంకర్‌బాబుతో కలసి ఆమె ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ... వేరుశనగ సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. మట్టి పరీక్షలు తప్పనిసరిగా చేయించాలన్నారు. ఈ పరీక్షల ఆధారంగానే పంటల సాగు, ఎరువుల వినియోగం ఆధారపడి ఉంటుందన్నారు. రెండు మూడు రోజుల్లో వర్షం పడే అవకాశం ఉండడంతో వేరుశనగ విత్తుకునేందుకు ఇది సరైన సమయమన్నారు. తెగుళ్ల బారి నుంచి వేరుశనగ పంటకు రక్షణగా పొలం చుట్టూ జొన్న, సజ్జ పంట సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు మద్దిలేటి, శైలజాకుమారి, బాలునాయక్, మురళీకృష్ణ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణుల అభ్యున్నతే లక్ష్యం



మాట్లాడుతున్న బ్రాహ్మణ ఐక్యవేదిక నాయకులు

అనంతపురం కల్చరల్: ఐక్యత లేక అభివృద్ధికి నోచుకోని బ్రాహ్మణ సంఘాలన్నింటినీ ఒక తాటిపైకి తెచ్చేందుకు కృషి చేస్తామం. ఐక్యతతోనే బ్రాహ్మణుల అభివృద్ధి సాధ్యమని సీనియర్ న్యాయవాది హోసూరు రామసుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం రాత్రి బ్రాహ్మణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూలై 7న మొదటి రోడ్డు శివాలయంలో జరిగే అఖిల భారత బ్రాహ్మణ ఐక్యవేదిక సమావేశం వివరాలు వెల్లడించారు. దశాబ్దాలుగా బ్రాహ్మణులు వేర్వేరుగా ఉంటున్నారని.. అందరినీ కలపడమే లక్ష్యంగా ప్రత్యేక సమావేశం జరుగుతోందన్నారు. 7న ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అనంతరం బ్రాహ్మణ ఐక్య వేదిక సమావేశం ఉంటుందన్నారు. మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తున్నామని అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కార్యకర్తలకు అండగా నిలుస్తాం



వైఎస్సార్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

చెన్నేకొత్తపల్లి: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా నిలుస్తామని ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ మైలారపు గోవిందరెడ్డి భరోసా ఇచ్చారు. గురువారం చెన్నేకొత్తపల్లి న్యామద్దెల సర్కిల్‌లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎంపీపీ చాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల తరువాత తిరిగి అందరినీ కలిసిందుకు సంతోషంగా ఉందన్నారు. ఇకపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. గ్రామాల్లో అధికార పార్టీ వారి నుంచి సమస్యలు ఎదురైతే వాటికి భయపడకుండా అండగా నిలుస్తామన్నారు.

- నగరంలో యథేచ్ఛగా అడ్వైటైజ్‌మెంట్ బోర్డుల ఏర్పాటు
- ఆలస్యంగా మేలుకుంటున్న టౌన్ ప్లానింగ్
- నగరపాలక సంస్థ ఆదాయానికి గండి
- పన్ను వసూళ్లలోనూ జాప్యం

ఇష్టారాజ్యం..!



సప్తగిరి సర్కిల్‌లో అనధికారికంగా ఏర్పాటు చేసిన బోర్డులను తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)

అనంతపురం కార్పొరేషన్: టౌన్ ప్లానింగ్ అధికారుల మొద్దునిద్ర వ్యాపారులకు వరంగా మారింది. అనధికారికంగా బోర్డులు ఏర్పాటు చేసినా.. అధికారులు ఏమాత్రం పట్టించుకోలేదు. కమిషనర్ మేఘ స్వరూప్ ఎక్కడ తమపై చర్యలు తీసుకుంటారోనని నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు ఆలస్యంగా మేలుకున్నారు. నగరంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన బోర్డులను ఒకటి వెంట మరొకటి తొలగిస్తున్నారు. అనధికార బోర్డులను గుర్తించడంలో నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు నిర్లక్ష్యం చేయడంతో పాటు అడ్వైటైజ్‌మెంట్ పన్ను వసూళ్లలో తీవ్ర జాప్యంతో నగరపాలక సంస్థ ఆదాయానికి గండిపడుతోంది.

18 అనధికారిక బోర్డులు

నగరంలోని సప్తగిరి సర్కిల్, జూనియర్ కళాశాల, జేఎన్‌టీయూ, శ్రీకంఠం సర్కిల్ బీమా లాడ్జ్, రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్, జీసస్ నగర్, సాయినగర్ రెండో క్రాస్, పాతూరు పవర్ ఆఫీస్ తదితర ప్రాంతాల్లో అనధికారికంగా భారీ బోర్డులను నిర్వహిస్తున్నారు. వాస్తవంగా ఈ బోర్డులున్న ఏజెన్సీలు ప్రకటనలు వేసుకుని రూ.లక్షల్లో డబ్బులు సంపాదించుకుంటున్నారు. కానీ నగరపాలక సంస్థ అధికారులు అటువైపు తొంగి చూడకపోవడంతో నగరపాలక సంస్థకు ఆదాయం రావడం లేదు. ఇటీవల కమిషనర్ మేఘ స్వరూప్ ఆదేశాలతో డీసీపీ మారుతి హరిప్రసాద్, టీపీఓ శిరీష, తదితరులు వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. అయినా ఇప్పటికీ పూర్తిస్థాయిలో బోర్డులను తొలగించక పోవడం గమనార్హం.

నిద్రమత్తులో అధికారులు..

అడ్వైటైజ్‌మెంట్ పన్ను వసూళ్లలోనూ నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారులు నిద్రమత్తులో ఉన్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నగరపాలక సంస్థ పరిధిలో 196 బోర్డులు/హోర్డింగ్‌లు, 210 లాలీపప్స్, తదితర వాటిని ఏర్పాటు చేశారు. వాస్తవంగా వివిధ ఏజెన్సీల పరిధిలో వీటిని ఏర్పాటు చేశారు. ఈ అసెస్‌మెంట్లకు సంబంధించి 2023–24లో మొత్తం రూ.58 లక్షలు వసూలు కావాల్సి ఉంది. కాగా ఇప్పటి వరకు రూ.44 లక్షలు మాత్రమే వసూలు చేశారు. గతేడాదికి సంబంధించి రూ.19 లక్షల వరకు బకాయిలు రావాల్సి ఉంది. అడ్వైటైజ్‌మెంట్ ఏజెన్సీలు ముందస్తుగానే ప్రకటలకు డబ్బులు దండుకుంటాయి. కానీ నగరపాలక సంస్థ అధికారులకు చెల్లించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు మేలుకుని వసూళ్ల వేగవంతం చేస్తారో లేదో వేచి చూడాలి.

> **చర్యలు తీసుకుంటున్నాం**
>
> అనధికారికంగా బోర్డులు వేసిన మాట వాస్తవమే. ఇటీవల వాటిని గుర్తించి, తొలగించేలా చర్యలు తీసుకున్నాం. నగరపాలక సంస్థ అనుమతులు లేకుండా బోర్డులను ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవు. అడ్వైటైజ్‌మెంట్ పన్ను వసూళ్లను వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటాం.
>
> – మారుతి హరిప్రసాద్ (డీసీపీ, టౌన్ ప్లానింగ్)

జేడీఏ కార్యాలయంలో పారిశుధ్య పనులు



జేడీఏ కార్యాలయంలో గడ్డిని తొలగిస్తున్న దృశ్యం



చెత్తా చెదారాన్ని శుభ్రం చేస్తున్న కూలీలు

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం అగ్రికల్చర్: జేడీఏ కార్యాలయ ఆవరణలో 'ఎటు చూసినా చెత్తే' అనే శీర్షికతో సాక్షిలో మంగళవారం ప్రచురితమైన ఫొటో కథనానికి వ్యవసాయశాఖ అధికారులు స్పందించారు. గురువారం 10 మంది కూలీలు, ట్రాక్టర్ ద్వారా జేడీఏ కార్యాలయ ఆవరణలో ఉన్న చెత్తా చెదారం, కలుపు మొక్కలు, ఇతరత్రా వ్యర్థాలు తొలగించారు. ఏడాదికి పైగా పేరుకుపోయి కుళ్లిపోయిన చెత్తదిబ్బలు నాలుగు ట్రాక్టర్లకు పైగా బయటకు తరలించినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి. కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేయడంతో ఆ శాఖ వర్గాలు పలువురు సాక్షికి ధన్యవాదాలు తెలియజేశారు.

ఘనంగా ఇటుకుల పల్లయ్య, పెదయ్య స్వామి ఊరేగింపు



రాప్తాడులో స్వాములను ఊరేగిస్తున్న దృశ్యం

రాప్తాడు: మండల కేంద్రంలో రెండు రోజుల పాటు ఇటుకుల పల్లయ్య, పెదయ్య స్వాములను కురుబ కులస్తులైన గంజి, బులకొండ, చిరుతల, చిదగొండ, బుల్లె కాపులు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. కనగానపల్లి పెదయ్య స్వామిని గత 20 సంవత్సరాలు, ఇటుకుల పల్లయ్య స్వామిని 8 సంవత్సరాల తర్వాత రాప్తాడులోకి కాపులు తీసుకుని రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గంజి, బులకొండ, చిరుతల, చిదగొండ కాపులు అనంతపురం రూరల్ మండలంలోని ఇటుకులపల్లిలో వెలసిన ఇటుకుల పల్లయ్య స్వామితో పాటు శ్రీ సత్యసాయి జిల్లాలోని కనగానపల్లి మండలంలోని అతగల్లు పట్నంలో వెలసిన పెదయ్య స్వామిని బుధవారం సాయంత్రం రాప్తాడుకు తీసుకువచ్చి కాపులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒకే సారి రెండు దేవర్లు గ్రామానికి తీసుకురావడంతో బుధవారం రాత్రి కాపులు స్వాములను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రంతా గ్రామంలో భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అదేవిధంగా మళ్లీ గురువారం సాయంత్రం కూడా గ్రామంలో కాపులు స్వాములను ఊరేగించారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఊరేగింపు వేడుకలను తిలకించేందుకు మండలం నుంచే గాక ఇతర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. దీంతో రాప్తాడులో వీధులు జనసంద్రమయ్యాయి. యువతులు, మహిళలు ప్రతి ఇంటి నుంచి స్వామికి బిందెలతో నీరు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఊరేగింపు వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ మునిస్వామి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

పార్కుల్లో వసతుల కల్పనకు చర్యలు



అధికారులకు సూచనలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని వివిధ డివిజన్లలోని పార్కుల్లో నిర్మాణ దశలో ఉన్న పనులు మరింత వేగవంతం చేయాలని ఏడీఏ పసన్న లక్ష్మి, తదితర అధికారులను మేయర్ వసీం ఆదేశించారు. గురువారం నగరంలోని 37, 38వ డివిజన్ పరిధిలో మేయర్ పర్యటించారు. రాంనగర్ పార్కులో అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు పూర్తి చేసి పార్కును అందుబాటులో తీసుకురావాలన్నారు. రాంనగర్ పార్కులో వాటర్ ఫౌంటైన్, లాన్, వాల్ ఆర్ట్ పనులు కూడా అదనంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నగరంలోని అన్ని పార్కుల్లో ప్రజలకు ఆహ్లాదం కల్పించేలా మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు, పచ్చదనం పెంపు, నూతన జిమ్ పరికరాల ఏర్పాటు వంటి సౌకర్యాలు పెంపొందిస్తున్నట్లు తెలిపారు. కోవూర్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న రోడ్డు పక్కన ఫుట్‌పాత్ ఏర్పాటు చేయాలని స్థానికులు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే అంచనాలు సిద్ధం చేయాలని ఇంజినీర్లను మేయర్ ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అనిల్‌కుమార్ రెడ్డి, కమల్‌భూషణ్, ఈఈ సూర్యనారాయణ, ఏఈ శంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు ఖాజా, నాగార్జున రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

7న అఖిల గాండ్ల సర్వసభ్య సమావేశం

అనంతపురం టవర్‌క్లాక్: అఖిల గాండ్ల, తెలికల సంక్షేమం కోసం జూలై 7న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుభాష్ చంద్రబోస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస నగర్‌లోని బాలాజీ కళ్యాణ మండపంలో జరగనున్న సమావేశంలో కొత్త కమిటీలు ఏర్పాటు చేయనునట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు.

విద్యార్థి చదువుకు 'అమ్మ' చేయూత



విద్యార్థికి రూ.లక్ష చెక్కు అందిస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: ఓ నిరుపేద విద్యార్థి చదువుకునేందుకు ఆర్థికంగా చేయూత అందించారు అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి. వివరాలు.. నగరానికి చెందిన ప్రసాద్, లలిత దంపతుల కుమారుడైన దేవాంగ సాగర్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతిలో 598 మార్కులు తెచ్చుకున్నాడు. తండ్రి ఓ చీరల అంగడిలో సేల్స్‌మెన్‌గా, తల్లి ఇళ్లలో పాచిపనులు చేసుకుంటున్నారు. విజయవాడలో ఐఐటీ కోచింగ్‌కు రూ.2 లక్షలు అవసరమయ్యాయి. అంత డబ్బు కట్టేందుకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి విద్యార్థి చదువుకునేందుకు రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. దేవాంగ సాగర్ ప్రతిభను గుర్తించిన రమణారెడ్డికి ఆ కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది.

పంటల సాగుకు సాయం అందించాలి



ఆత్మకూరు: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు కౌలు సంఘం నాయకులు



తహసీల్దార్ సీతారాంకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

రాప్తాడురూరల్/ఆత్మకూరు/రాప్తాడు: రైతులకు చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పంటల సాగుకు రూ. 20 వేలు ఈ ఖరీఫ్ సీజన్‌లోనే అందించాలని సీపీఐ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా రైతాంగ సమస్యలపై గురువారం అనంతపురం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ పెంచి పంట రుణాలు రూ.3 లక్షల వరకు వడ్డీ లేకుండా, రూ.5 లక్షల వరకు పావలా వడ్డీతో ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి, రుణాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నియోజకవర్గ నాయకులు రమేష్, చలపతి, నగేష్, వెంకట రాముడు, మండల నాయకులు అక్కులప్ప, రెడ్డెప్ప, నరసింహులు, వెంకటేష్, మహేంద్ర, కుళ్లాయప్ప పాల్గొన్నారు. కౌలు రైతులకు సాగు సాయం కింద రూ.15 వేలు ఇవ్వాలని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ కోరారు. గురువారం ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటి తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఖరీఫ్‌కు సంబంధించిన సాగు విత్తనాలు రైతులకు 90 శాతం సబ్సిడీతో అందజేయాలన్నారు. శాసనసభ సమావేశాల్లో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం కార్యదర్శి రామాంజనేయులు, గోపాల్, ముత్యాలన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగు నీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగు నీటిని అందించాలని సీపీఐ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడుఎం.చలపతి పేర్కొన్నారు. గురువారం రాప్తాడు తహసీల్దార్ కార్యాలయంలో రైతుల సమస్యలపై తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.75 వేలు, ఉద్యాన పంటలకు ఎకరాకు రూ.లక్ష రూపాయలు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. వ్యవసాయ పంపు సెంట్లకు మీటర్లు బిగించే జీఓ నంబర్ 22ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యనిర్వాహక అధ్యక్షుడు వెంకట్రామ్, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ బుల్లె నాగేష్, నాయకులు రసూల్, మౌలాలి, వెంకటరాముడు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ(ఏ) ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా ఎస్వీ సత్యనారాయణ

అనంతపురం: జేఎన్‌టీయూ (అనంతపురం) ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌గా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణను నియమించారు. ప్రస్తుతం పనిచేస్తున్న రిజిస్ట్రార్ సి. శశిధర్ రిలీవ్ కావడంతో... ఇన్‌చార్జ్‌గా సత్యనారాయణకు బాధ్యతలు అప్పగిస్తూ గురువారం వీసీ జీవీఆర్ శ్రీనివాస రావు ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం వీసీ తన పదవికి రాజీనామా చేశారు.

వసతి గృహాల్లో దోమకాటు నివారణ చర్యలు



మహిళల వసతి గృహంలో మలాథియన్ పిచికారీ చేస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ, ఆరోగ్యశాఖ సంయుక్తంగా నగరంలోని మహిళల వసతి గృహాల్లో దోమకాటు నివారణ చర్యలు చేపట్టింది. గురువారం ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి పర్యవేక్షణలో ప్రభుత్వ బీసీ బాలికల డిగ్రీ కళాశాల వసతి గృహం, ఎస్సీ, మైనార్టీల బాలికల వసతి గృహంలో మలాథియన్ పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఎంహెచ్ఓ మాట్లాడుతూ.. దోమకాటు నివారణ చర్యల్లో భాగంగా నగరంలోని వసతి గృహాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. దోమకాటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా నగరంలోని వివిధ డివిజన్ల పరిధిలో ఫాగింగ్, స్ప్రేయింగ్ చేయించడం జరుగుతోందన్నారు. దీంతో పాటుగా పూడికతీత పనులు చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. దోమ లార్వా వృద్ధి చెందకుండా నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో ఆయిల్‌బాల్స్ వేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సైతం స్వీయ జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్‌మూర్తి, వసతి గృహ సంరక్షకురాలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ ఉషారాణిని సస్పెండ్ చేయాలి

అనంతపురం టవర్‌క్లాక్: గుత్తి వద్ద ఉన్న రజాక్‌పురం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణిని సస్పెండ్ చేయాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలో చదువుతున్న 40 మంది విద్యార్థుల అనారోగ్యానికి ప్రిన్సిపాల్ నిర్లక్ష్యమే కారణమని తెలిపారు. తక్షణమే ఆమెను సస్పెండ్ చేసి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.

డాక్టర్ ఉదయ్‌పై చర్యలు తీసుకోండి

చెన్నేకొత్తపల్లి: ఏఎన్‌ఎంలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ.. మెసేజ్‌లు పంపుతున్న ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ డాక్టర్ ఉదయ్‌పై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుజ్జల సురేష్ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా డాక్టర్ ఉదయ్ ఎక్కడ పని చేసినా కింది స్థాయి సిబ్బందితో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఈ విషయాన్ని చాలా మంది మహిళా ఉద్యోగులు బయటకు చెప్పలేక మానసికంగా కుంగిపోతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వారితో డాక్టర్ వృత్తికే కళంకం వస్తోందన్నారు. విచారణకు నియమింపబడిన సభ్యులు నిష్పక్షపాతంగా విచారణ చేయాలని కోరారు. బాధితులకు న్యాయం జరగకపోతే ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామన్నారు.

విద్యా సంస్థలను సీజ్ చేయాలి



ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న కార్పొరేట్ విద్యా సంస్థలను సీజ్ చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఏఐఎస్ఎఫ్ ఎస్ఎఫ్ఐ ఏఐఎస్బీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థి సమైఖ్య, వీఎస్ఐవీ సంఘాల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న నారాయణ పాఠశాల వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు కుళ్లాయి స్వామి, పరమేష్, పృథ్వీ, సురేష్ యాదవ్, వినోద్ కుమార్ మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్ముతున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి ఆకర్షణీయమైన పేర్లు ఏర్పాటు చేసుకొని విచ్చలవిడిగా ఫీజులు దోపిడీ చేస్తున్నారని మండిపడ్డారు. విద్యాశాఖ అధికారులు స్పందించి విద్యాసంస్థల పేరుతో ముద్రించిన పుస్తకాలు అమ్మకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు మంజునాథ్, హరికృష్ణ, సమీర్, హర్ష, ఆనంద్, తరుణ్, అరుణ్, చంద్ర, గణేష్, హరీష్ పాల్గొన్నారు.

డాక్టర్ విజయకుమార్ మృతి బాధాకరం



డాక్టర్ విజయ కుమార్ (ఫైల్)

అనంతపురం కార్పొరేషన్: నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ నీలం విజయకుమార్ మృతిపై సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో సంతాపం తెలియజేశారు. కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకుడు నీలం రాజశేఖర్ రెడ్డి పెద్ద కుమారుడైన డాక్టర్ నీలం విజయకుమార్ మరణం చాలా బాధాకరమన్నారు. అనంతపురంలో నేత్ర వైద్యుడిగా ఉంటూ సీపీఐ పార్టీకి ఎంతో సహకరించారన్నారు. సామాన్య ప్రజలకు ఎన్నో సేవలందించడంతో పాటు హైదరాబాద్‌లో నీలం రాజశేఖర్ రెడ్డి రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు సహాయ సహకారాలందించారని గుర్తు చేశారు. రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్‌గా పని చేశారన్నారు. అదే విధంగా సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ మరో ప్రకటనలో సంతాపం తెలిపారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

అనంతపురం రూరల్: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిశోర్ అన్నారు. గురువారం శ్రీకృష్ణదేవరాయ ఉద్యాన కళాశాలలో ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లె వెంకటకృష్ణ కిశోర్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివితేనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారన్నారు. ఉపాధ్యాయులు, పెద్దలతో గౌరవంతో మెలగాలన్నారు. హార్టికల్చర్ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని పేర్కొన్నారు. మొదటి సంవత్సరం నుంచి కష్టపడి చదివితేనే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరరెడ్డి, విశ్రాంత శాస్త్రవేత్త ప్రొఫెసర్ టీఎస్ శివానంద, కళాశాల డీన్ ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.